కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాలు-పరిష్కార మార్గాలు

భారతదేశం అధికార కేంద్రీకృత ధోరణి గల సమాఖ్య విధానాన్ని అనుసరిస్తుంది. రాజ్యాంగం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల పంపిణీ జరిగినప్పటికీ కేంద్రానికి ఎక్కువ అధికారాలు కేటాయించడంతో కేంద్రం రాష్ట్రాలపై ఆధిపత్యాన్ని కలిగి ఉంది. కేంద్రం తరచుగా రాష్ట్రాల విషయాల్లో జోక్యం చేసుకున్నప్పటికీ 1967 సాధారణ ఎన్నికల వరకు కేంద్రంలోనూ, పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉండటం వల్ల కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదాలు అంతగా తలెత్తలేదు. 1967లో జరిగిన ఎన్నికల్లో అనేక రాష్ట్రాల్లో కాంగ్రేసేతర పక్షాలు అధికారంలోకి వచ్చాయి. కేంద్రంలో తక్కువ మెజారిటీతో కాంగ్రెస్ అధికారాన్ని చేపట్టింది. రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ప్రతిపక్షాలు రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు కావాలని, కేంద్రం ఆధిపత్యాన్ని ప్రశ్నించడం మొదలు పెట్టాయి. దీంతో కేంద్రం-రాష్ట్రాల మధ్య తరచుగా వివాదాలు తలెత్తాయి. తమిళనాడులో డీఎంకే, పంజాబ్‌లో అకాళీదళ్ ప్రభుత్వాలు రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిని కల్పించాలనే డిమాండ్‌ను ముందుకు తీసుకువచ్చాయి.

వివాదాలకు ప్రధాన కారణాలు

- కేంద్రానికి ఎక్కువ అధికారాలు ఉండటం, రాష్ట్రాలకు తక్కువ అధికారాలుండటం
- కేంద్రం తరచుగా రాష్ట్రాల విషయంలో జోక్యం చేసుకోవడం
- రాష్ట్రాలకు ఆదాయ వనరులు తక్కువగా ఉండటంతో తరచుగా కేంద్రాలపై ఆధారపడవలసి రావడం
- 356 అధికరణను తరచుగా దుర్వినియోగం చేయడం
- ప్రణాళికా సంఘం, ఫైనాన్స్ కమిషన్లు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేయడం
- కేంద్రంలో, రాష్ట్రాల్లో వేరు వేరు పార్టీలు అధికారంలో ఉండటం

పరిష్కార మార్గాలు

1967 సాధారణ ఎన్నికల తర్వాత కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య వివాదాలు తలెత్తడంతో సమస్యల పరిష్కారానికి ఇందిరాగాంధీ ప్రభుత్వం పరిపాలనా సంస్కరణల కమిషన్‌ను నియమించి తగిన సూచనలు చేయాలని కోరింది. ఎం.సి. సీతల్‌వాడ్ నాయకత్వంలోని కమిటీ పలు సూచనలు చేసింది.

పరిపాలనా సంస్కరణల కమిషన్ సూచనలు(1969)

- రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు కల్పించడం కోసం రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం లేదు
- కేంద్రం తరచుగా రాష్ట్రాల విషయాల్లో జోక్యం చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి
- 263 అధికరణను అనుసరించి అంతర్ రాష్ట్ర కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి
- 275 అధికరణను అనుసరించి కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే సహాయక గ్రాంట్లను కేవలం ఉత్పాదకతతో కూడుకున్న పరిశ్రమల స్థాపన కోసం మాత్రమే ఇవ్వాలి
- ఫైనాన్స్ కమిషన్ చేసిన సూచనల ప్రకారమే కేంద్ర-రాష్ట్రాల మధ్య ఆదాయ పంపిణీ జరగాలి
- రాజ్యాంగం ప్రకారం నడుచుకోవడంలో గవర్నర్లకు తగిన సూచనలు చేయాలి

పరిపాలనా సంస్కరణల కమిషన్ చేసిన ఈ సూచనలు అనేక రాష్ట్ర ప్రభుత్వాలకు రుచించలేదు. నాలుగో సాధారణ ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజమన్నార్ నాయకత్వంలో ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీ 1970లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

రాజమన్నార్ కమిటీ సూచనలు

- రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలను కల్పించడం కోసం రాజ్యాంగాన్ని వెంటనే సవరించాలి
- ఉమ్మడి జాబితాలో పేర్కొన్న కొన్ని జాతీయ ప్రాముఖ్యమున్న అంశాలను కేంద్రానికి కేటాయించి మిగతా అధికారాలను రాష్ట్రాలకు కేటాయించాలి
- రాష్ట్రాలకు ఎక్కువ ఆదాయం కోసం, ఆర్థిక వనరులను సమీకరించడం కోసం పన్నుల వ్యవస్థలో మార్పులు చేయాలి
- రాష్ట్రాల పాలిట శాపంగా మారిన 356, 357 అధికరణలను రద్దు చేయాలి
- అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగాలను రద్దు చేయాలి
- అంతర్ రాష్ట్ర కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు లేదా రద్దు రాష్ట్ర శాసనసభలోనే నిర్ణయించాలి
- రాజ్యసభలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం ఉండాలి, రాష్ట్రపతి 12 మందిని నియమించే అధికారాన్ని రద్దు చేయాలి
- కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య తలెత్తే వివాదాలను సుప్రీంకోర్టు పరిష్కరించాలి

సర్కారియా కమిషన్ సూచనలు

1983లో ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, కర్ణాటకలో జనతా పార్టీ అధికారంలోకి వచ్చాయి. ఇదే సమయంలో జమ్మూ-కాశ్మీర్, పశ్చిమ బెంగాల్

రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రాలకు ఎక్కువ అధికారాన్ని కల్పించాలనే డిమాండ్ చేయడంతో ఇందిరాగాంధీ ప్రభుత్వం జస్టిస్ ఆర్.ఎస్. సర్కారియా నాయకత్వంలో ఒక కమిషన్‌ను నియమించింది. 1988లో ఈ కమిషన్ రాజీవ్‌గాంధీ ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించింది. 247 అంశాలపై సూచనలు చేసింది.

- గవర్నర్లను నియమించేటప్పుడు సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రిని తప్పనిసరిగా సంప్రదించాలి
- క్రియాశీలక రాజకీయాల్లో పాల్గొనేవారిని గవర్నర్లుగా నియమించరాదు
- పలు రంగాల్లో ప్రతిభావంతులైన వారిని గవర్నర్లుగా నియమించి వారికి ప్రవర్తనా నియమావళిని ఏర్పాటు చేయాలి
- 356 అధికరణను అనుసరించి రాష్ట్రపతి పాలన విధించేటపుడు గవర్నర్ నివేదిక తప్పనిసరి
- రాష్ట్రపతి పాలనను చివరి అస్త్రంగా వినియోగించాలి. పార్లమెంటు ఆమోదం లేకుండా రాష్ట్ర శాసనసభను రద్దు చేయరాదు
- అఖిల భారత సర్వీసులను పటిష్టం చేయాలి
- త్రిభాషా సూత్రాన్ని సమర్థంగా అమలు చేయాలి
- కేంద్ర సాయుధ బలగాలను మోహరించినపుడు కేంద్రం స్వతంత్రంగా వ్యవహరించాలి
- ప్రసార సాధనాలైన దూరదర్శన్, రేడియోలలో రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యమివ్వాలి
- రాష్ట్రాల ఆర్థిక వనరులను మెరుగుపరుచుకోవడానికి పన్నుల వ్యవస్థలో మార్పులు తేవాలి
- కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి అంతర్ రాష్ట్ర కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి

ప్రాక్టీస్ ప్రశ్నలు...

1. ఏ సంవత్సరంలో జమ్మూ-కాశ్మీర్ అసెంబ్లీ స్వయం ప్రతిపత్తి తీర్మానాన్ని ఆమోదించింది?

ఎ) 1957 బి) 1972 సి) 1998 డి) 2000

2. భారతదేశంలో కేంద్ర-రాష్ట్రాల మధ్య వివాదాలకు బీజం వేసిన అంశం?

ఎ) 1967లో కేంద్రంలో బలహీనమైన ప్రభుత్వం ఏర్పడటం

బి) 1969లో కాంగ్రెస్ పార్టీలో చీలిక రావడం

సి) 1967లో గోలక్‌నాథ్ కేసులో సుప్రీంకోర్టు ప్రభుత్వానికి వ్యతిరేకమైన తీర్పునివ్వడం

డి) 1967లో రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు అధికారం లోకి రావడం

3. అఖిల భారత సర్వీసులను రద్దు చేయకుండా మరింత విస్తృతం చేయాలని సూచించింది?

ఎ) రాజమన్నార్ కమిటీ బి) సర్కారియా కమిటీ

సి) రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్

డి) పూంచీ కమిషన్

4. కేంద్ర-రాష్ట్రాల మధ్య వివాదాలను సామరస్యంగా పరిష్కరించడం కోసం రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేసిన సంస్థ?

ఎ) సుప్రీంకోర్టు బి) అంతర్ రాష్ట్ర కౌన్సిల్

సి) కేంద్ర-జలవనరుల సంఘం

డి) జాతీయాభివృద్ధి మండలి

5. అంతర్‌రాష్ట్ర కౌన్సిల్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?

ఎ) 1988 బి) 1990 సి) 1996 డి) 2004

6. అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాలను పరిష్కరించే ట్రిబ్యునల్‌కు న్యాయ ప్రతిపత్తిని కల్పించాలని సూచించిన కమిషన్?

ఎ) పూంచీ కమిషన్ బి) సర్కారియా కమిషన్

సి) రాజ్యాంగ సమీక్ష కమిషన్ డి) రాజమన్నార్ కమిటీ

7. ఆనందపూర్ సాహెబ్ తీర్మానం ప్రధానంగా దేనిపై కేంద్రీకరించింది?

ఎ) కేంద్ర-రాష్ట్ర సంబంధాలు

బి) పంజాబ్ ప్రత్యేక హక్కులు

సి) అమృత్‌సర్ అభివృద్ధిపై

డి) పంజాబ్ అభివృద్ధిపై

జవాబులు	1	2	3	4	5	6	7
	D	D	B	B	B	C	B

ఆనందపూర్ సాహెబ్ తీర్మానం

1973లో పంజాబ్ రాష్ట్రంలో అధికారం ఉన్న అకాలీదళ్ పార్టీ తల్వాండి జిల్లాలోని ఆనందపూర్ సాహెబ్ అనే గ్రామంలో ఓ తీర్మానం చేసింది. జాతీయ ప్రాముఖ్యం గల దేశరక్షణ, విదేశీ వ్యవహారాలు, కరెన్సీ, రైల్వేలు, విమానయానం వంటి అంశాలను కేంద్రానికి కేటాయించి మిగిలిన అధికారాలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వాలకు కేటాయించాలి అని ఈ తీర్మానం పేర్కొంది.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తీర్మానం

1977లో పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది.

- బలమైన రాష్ట్రాలను ఏర్పాటుచేసే సమాఖ్య విధానాన్ని బలపరచాలి.
- రాజ్యాంగంలో ప్రస్తుతం ఉన్న అధికారాల పంపిణీని పునర్ వ్యవస్థీకరించి రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలను కల్పించాలి.
- 355, 356, 365 అధికరణలను రాజ్యాంగం నుంచి తొలగించాలి.
- గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి
- రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చటానికి అవసరమైన వనరులను కల్పించాలి.

రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్ సూచనలు

జస్టిస్ ఎం.ఎన్. వెంకటాచలయ్య నాయకత్వంలోని కమిషన్ 2002లో కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై కొన్ని సూచనలు చేసింది.

- పరిపాలనా విషయాల్లో కేంద్రం, రాష్ట్రాల సమన్వయంతో సహకార సమాఖ్యను నెలకొల్పాలి.
- అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టు స్థాయి ఉన్న ముగ్గురు న్యాయమూర్తులతో కమిటీని నియమించాలి.
- రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ 6 నెలల లోపు నిర్ణయం తెలపాలి
- వివాదరహితులను గవర్నర్లుగా నియమించాలి.
- గవర్నర్ నివేదిక ఆధారంగానే రాష్ట్రపతి పాలన విధించాలి.

పూంఛీ కమిషన్

2004లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన యూపీఏ ప్రభుత్వం 2005లో సర్కారియా కమిషన్ సూచనల అమలు తీరును దృష్టిలో ఉంచుకొని ఇటీవల కాలంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేయడానికి ఒక ప్రత్యేక కమిషన్‌ను నియమించాలని తీర్మానించింది. 2007లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మదన్ మోహన్ పూంఛీ నాయకత్వంలో ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ గరిష్ట కాలపరిమితి 2 సంవత్సరాలు.

ప్రాక్టీస్ ప్రశ్నలు..

1. భారతదేశంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై అధ్యయనం చేసిన అన్ని కమిటీలు ఏ అంశంపై ఏకాభిప్రాయాన్ని వ్యక్తీకరించాయి?

ఎ) రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిపై
బి) రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక వనరులపై
సి) 356 అధికరణ దుర్వినియోగంపై
డి) అంతర్ రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటుపై

2. ప్రస్తుతం కేంద్ర-రాష్ట్రాల మధ్య ఆదాయ పంపిణీ ఏ రాజ్యాంగ సవరణ ప్రకారం జరుగుతోంది?

ఎ) 78వ సవరణ బి) 80వ సవరణ
సి) 82వ సవరణ డి) 84వ సవరణ

3. కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై నియమించిన కమిషన్లలో భిన్నమైంది?

ఎ) పరిపాలనా సంస్కరణల కమిషన్
బి) రాజమన్నార్ కమిటీ
సి) సర్కారియా కమిషన్
డి) మదన్ మోహన్ పూంఛీ కమిషన్

జవాబులు	1	2	3
	D	B	B